# నమస్తే తెలంగాణ
## మంచిర్యాల
## కుమ్రం భీం ఆసిఫాబాద్

5 | మంగళవారం 15 అక్టోబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD




ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

# సమస్యలు పరిష్కరిస్తాం

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్
- ప్రజావాణిలో దరఖాస్తుల స్వీకరణ

నస్పూర్/కోటపల్లి, అక్టోబర్ 14 : జిల్లా కేంద్రంలోని నస్పూర్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ కుమార్ దీపక్.. అదనపు కలెక్టర్ మోతీలాల్‌తో కలిసి ఫిర్యాదులు స్వీకరించారు. దరఖాస్తులను పరిశీలించి పరిష్కరిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. కోటపల్లికి చెందిన మంత్రి రామయ్య ఎస్సీ గురుకులానికి నూతన భవనం నిర్మించాలని, కోటపల్లి మండల కేంద్రంలో రోడ్డు వెడల్పులో కోల్పోయిన 100 మందికి ఇండ్లు మంజూరు చేయాలని, పోడు భూములు సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు ఇవ్వాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం పలు సమస్యలపై కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి అందించిన వినతి పత్రం ప్రతులను కూడా కలెక్టర్‌కు చూపించారు. అలాగే కాసిపేట మండలం కోమటి చేను శివారులో తన పేరు మీదున్న ఎకరం భూమిని తాను చనిపోయినట్లుగా పత్రాలు సృష్టించి కాజేశారని, తనకు న్యాయం చేయాలని మందమర్రికి చెందిన రొడ్డ మల్లయ్య కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి వేడుకున్నాడు.

# దరఖాస్తులపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలి

**ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే**

ఆసిఫాబాద్ టౌన్,అక్టోబర్ 14: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులపై ప్రత్యేక శ్రద్ధపెట్టి సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, దాసరి వేణుతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ గత ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తుల పురోగతిపై శాఖల వారీగా సమీక్షించారు.



దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

# నిజాయితీ చాటుకున్న కండక్టర్

బెల్లంపల్లి, అక్టోబర్ 14 : బస్సులో మర్చిపోయిన పర్సును బాధితురాలికి ఇచ్చి బెల్లంపల్లి గాంధీనగర్ గొల్లగూడెంకు చెందిన ఆర్టీసీ కండక్టర్ గాజనవేణి రాజేందర్ తన నిజాయితీని చాటుకున్నాడు. గోదావరిఖని డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సోమవారం గోదావరిఖని నుంచి బెల్లంపల్లికి బయల్దేరింది. దసరా సెలవుల అనంతరం బస్టాండ్ ప్రయాణికులతో రద్దీగా ఉంది. మందమర్రికి చెందిన మహిళ సీటు కోసం తన వద్ద ఉన్న పర్సును సీటులో వేసింది. కిక్కిరిసిపోయిన జనంతో బస్సు ఎక్కలేకపోయింది. కండక్టర్ ఆ పర్సును గమనించి, ఆరా తీశారు. ఈ క్రమంలో మహిళ కుటుంబీకులు పర్సులో ఉన్న మొబైల్‌కు ఫోన్ చేయగా, రాజేందర్ తన వద్ద ఉందని సమాచారం ఇచ్చాడు. వెంటనే వెనుక బస్సులో వారు వచ్చి కండక్టర్‌ను కలిశారు. వారికి పర్సు, అందులో ఉన్న రూ.20 వేలు, రెండు తులాల బంగారు ఆభరణాలను అందించాడు. ప్రయాణికులతోపాటు, బెల్లంపల్లివాసులు రాజేందర్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

# తేనెటీగల దాడి.. పాడెను వదిలి పరుగులు

బెల్లంపల్లి, అక్టోబర్ 14 : అంతిమయాత్రలో తేనెటీగలు దాడి చేయడంతో పాడెను వదిలేసి ప్రజలు పరుగులు పెట్టిన ఘటన సోమవారం బెల్లంపల్లి మండల శివారులోని పోచమ్మ చెరువు శ్మశాన వాటిక వద్ద జరిగింది. బూడిదగడ్డ బస్తీకి చెందిన సింగరేణి కార్మికుడు ఆడేటి శ్రీనివాస్ (52) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. బూడిదగడ్డ బస్తీ నుంచి 200 మందితో అంతిమయాత్ర నిర్వహిస్తున్నారు. పోచమ్మ చెరువు శ్మశాన వాటిక వద్దకు రాగానే ఎంపీడీవో కార్యాలయం మూలమలుపు వద్ద ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేశాయి. దీంతో కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామస్తులు పాడెను అక్కడే వదిలివేసి పరుగులు తీశారు. సుమారు 50 మందికి పైగా గాయాలయ్యాయి. సమీపంలోని తాళ్లగురిజాల పీహెచ్‌సీకి 30 మంది వెళ్లి చికిత్స చేసుకోగా, మరో 20 మంది ఇతర ప్రైవేట్ దవాఖానల్లో వైద్యం చేయించుకున్నారు. తేనెటీగలు వెళ్లిపోయాయని నిర్ధారించుకున్న రెండు గంటల తర్వాత పాడె వద్దకు వెళ్లి దహన సంస్కారాలు పూర్తి చేశారు.

# శోభను ఆదర్శంగా తీసుకోవాలి

కెరమెరి, అక్టోబర్ 14 : నిరుపేద కుటుంబానికి చెందిన పంద్రం శోభ(సోంబాయి) డీఎస్సీలో ఉద్యోగం సాధించి ఆదర్శంగా నిలిచిందని ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నా రు. మండలంలోని చౌపన్‌గూడలో సోమవారం చైతన్య యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆమెను సన్మానించారు. ఆత్రం సక్కు హాజరై, మాట్లాడారు. నేటి పోటీ యుగంలో రాణించాలంటే పట్టుదలతో చదువాలని, ఆదివాసీ యువత కోసం జిల్లా కేంద్రంలో స్టడీ సర్కిల్ ఏర్పాటు చేశారని తెలిపారు. అందులో శిక్షణ పొంది ప్రభుత్వ ఉద్యోగం సాధించిన వారిలో శోభ ఒకరని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పెందోర్ మోతీరాం, మాజీ వైస్ ఎంపీపీ సయ్యద్ అబూల్ కలాం, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



శోభను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే సక్కు


# ఎమ్మెల్యే కోవ లక్ష్మిని కలిసిన నాయకులు

రెబ్బెన, అక్టోబర్ 14 : రెబ్బెన మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మిని మర్యాద పూర్వకంగా కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మహిళా మండలాధ్యక్షురాలు అన్నపూర్ణ అరుణ, ఏఎంసీ మాజీ వైస్ చైర్‌పర్సన్ కుందారపు శంకరమ్మ, మాజీ డైరెక్టర్ పల్లె రాజేశ్వర్‌రావు, మాజీ సర్పంచ్‌లు బోమ్మినేని అహల్యాదేవి, తోట లక్ష్మణ్, బీఆర్‌ఎస్ నాయకులు అన్నపూర్ణ మురళీగౌడ్, వసంతరావు ఉన్నారు.



ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ని మర్యాదపూర్వకంగా కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీపై గురి!




## ఉమ్మడి జిల్లాలో ప్రచారం మొదలుపెట్టిన ఆశావహులు

- అధికార, ప్రతిపక్ష పార్టీలకు ప్రతిష్టాత్మకం కానున్న ఎన్నిక
- నవంబర్ 6వ తేదీ వరకు ఓటరు నమోదుకు అవకాశం

మంచిర్యాల, అక్టోబర్ 14(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్ జిల్లాల్లో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల హడావుడి మొదలైంది. ప్రస్తుత ఎమ్మెల్సీ పదవీకాలం వచ్చే ఏడాది మార్చి 29తో పూర్తవనుంది. దీంతో ఈ స్థానానికి ఎన్నికలు నిర్వహించడంపై రాష్ట్ర ఎన్నికల సంఘం దృష్టి సారించింది. సెప్టెంబర్ 30వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేసి ఓటర్ల నమోదు ప్రక్రియను చేపట్టింది. డిసెంబర్ 6వ తేదీ వరకు ఓటు నమోదు చేసేందుకు అవకాశం కల్పించింది. ఈ మేరకు డిసెంబర్ 30వ తేదీన ఓటర్ జాబితాను విడుదల చేయనుంది. అన్ని జిల్లాల కలెక్టరేట్లు, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో 2021 నవంబర్ 11లోపు డిగ్రీ ఉత్తీర్ణులైనవారు ఓటరుగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లోనూ ఓటు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఇవీ కాకుండా ఆశావహులు ఓటరు నమోదు కోసం ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. డిగ్రీ మెమో, ప్రొవిజనల్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, ఎలక్షన్ కార్డు ఎపిక్ నంబర్, ఫోన్ నంబర్, ఈ-మెయిల్ ఐడీ డిటేయిల్స్, పాస్‌ఫొటో, ఫామ్-18తో ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. 2019 ఎన్నికల్లో ఈ స్థానంలో 1.96 లక్షల మంది గ్రాడ్యుయేట్లు మాత్రమే ఓటర్లుగా నమోదు కాగా, ఈసారి ఈ సంఖ్య 9 నుంచి 10 లక్షలకు చేరుకునేలా అవగాహన కార్యక్రమాలు, ఓటరు నమోదు ప్రక్రియను చేపట్టారు.

### పార్టీలకు ప్రతిష్టాత్మకం

ఈ ఎన్నికలు రాజకీయ పార్టీలకు ప్రతిష్టాత్మకంగా మారాయి. ఇదీ అధికార కాంగ్రెస్ పార్టీ సిట్టింగ్ సీటు కావడంతో తిరిగి ఎలాగైనా పాగా వేయాలని ప్రయత్నిస్తున్నది. ప్రతిపక్ష బీఆర్‌ఎస్ పార్టీకి ఈ ఎన్నికల కీలకంగా మారింది. కాంగ్రెస్ పాలనపై ఉన్న వ్యతిరేకతను ఈ ఎన్నికల్లో గెలిచి జనంలోకి బలంగా వెళ్లాలని బీఆర్‌ఎస్ భావిస్తున్నది. కాగా.. బీజేపీకి కూడా ఈ ఎన్నికలు కత్తిమీద సాములా మారాయి. ఈ నాలుగు ఉమ్మడి జిల్లాల్లో ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటారు. దీంతో ఎమ్మెల్సీగా తమ పార్టీ అభ్యర్థిని గెలిపించుకునే వ్యూహాల్లో ఆ పార్టీ ఉన్నది.

### గంపెడాశల్లో అభ్యర్థులు

రాజకీయ పార్టీలకు కీలకంగా మారిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆశావహులు అన్ని రకాలుగా సిద్ధమవుతున్నారు. అధికార పార్టీ నుంచి పోటీ చేసి గతంలో ఇదే స్థానం నుంచి గెలిచిన జీవన్‌రెడ్డి అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. దీంతో ఈ సారి తిరిగి ఎమ్మెల్సీగా నిలబడాలని ఆసక్తిగా ఉన్నారు. గతంలో ఏడాది కాలంపాటు ఎమ్మెల్సీగా ఉండి రాజీనామా చేసిన ఆర్.సత్యనారాయణ కూడా కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్సీ టికెట్ ఆశిస్తున్నారు. వీరితోపాటు మరి కొందరు అధికార పార్టీ నుంచి మాకే టికెట్ వస్తుందంటూ ప్రచారం చేసుకుంటున్నారు. బీఆర్‌ఎస్ నుంచి కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్‌ల పేర్లు వినిపిస్తున్నాయి. అధికార పార్టీ అభ్యర్థిని అనుసరించి బలమైన అభ్యర్థిని బరిలోకి దించేందుకు బీఆర్‌ఎస్ సన్నాహాలు చేస్తున్నది. కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత స్పష్టంగా బయటపడుతున్న నేపథ్యంలో దాన్నే ఈ ఎన్నికల నినాదంగా జనంలోకి బలంగా వెళ్లేందుకు సిద్ధమవుతున్నది. అందుకు తగినట్లుగానే ఆ పార్టీ నుంచి అభ్యర్థిని ప్రకటించనుంది. ఇక బీజేపీ నుంచి కూడా చాలా మంది పేర్లు వినిపిస్తున్నాయి. మంచిర్యాల బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి వెరబెల్లి రఘునాథ్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు అధిష్ఠానంతో ఆయన టచ్‌లో ఉన్నట్లు తెలుస్తున్నది. ఈ పార్టీ నుంచి పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, రాణి రుద్రమదేవీ పేర్లు వినిపిస్తున్నాయి. ఇకపోతే పార్టీలతో సంబంధం లేకుండా కొందరు గ్రాడ్యుయేట్స్ పోటీకి సిద్ధమవుతున్నారు. వీలైతే పార్టీ నుంచి లేనిపక్షంలో ఇండిపెండెంట్‌గా పోటీ చేయాలని చూస్తున్నారు. ఆల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల రేసులో నిలబడడం దాదాపు కాయమైపోయింది. ఇక నిర్మల్ జిల్లాకు చెందిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు, సీపీఎస్ ఉద్యమకారుడు కృష్ణారావు ఈసారి బరిలో ఉండనున్నారు. సీపీఎస్ ఉద్యమకారుల ఓటు బ్యాంక్ ఈ నాలుగు జిల్లాల్లో అధికంగా ఉండడంతో ఆయన కూడా ఈ ఎన్నికల్లో కీలకంగా మారారు. ఇలా ఎవరి వారు టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తూనే, ప్రచారం చేస్తున్నారు. కొందరు అభ్యర్థులైతే ఓటర్ల నమోదు కోసం ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి, గ్రాడ్యుయేట్లను తమవైపు తిప్పుకునే పనుల్లో బిజీగా ఉన్నారు. ప్రభుత్వ ప్రైవేటు టీచర్లు, ఉద్యోగులు, నిరుద్యోగులు ఇలా అన్ని వర్గాలను కవర్ చేస్తూ సమావేశాలు నిర్వహిస్తున్నారు. దీంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల హడావుడి ఐదారునెలల ముందే మొదలైపోయింది.



కౌటాల మార్కెట్ ఏరియాలో ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

# కరెంట్ కోతలపై ఆగ్రహం

- కౌటాల సబ్ స్టేషన్ ఎదుట మిర్చి రైతుల ధర్నా
- మార్కెట్ ఏరియాలోని ప్రధాన రహదారిపై మూడు గంటల పాటు రాస్తారోకో
- కిలోమీటర్ మేర నిలిచిన వాహనాలు
- వ్యవసాయానికి 24 గంటల పాటు విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్

కుమ్రం భీం ఆసిఫాబాద్(నమస్తే తెలంగాణ)/కౌటాల, అక్టోబరు 14 : కరెంట్ కోతలపై మిర్చి రైతులు కన్నెర్ర చేస్తూ ఆందోళన బాట పట్టారు. సోమవారం కౌటాల మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ ఎదుట గుండాయి సబ్ స్టేషన్ పరిధిలోని తాటిపల్లి, గుండాయిపేట్, గుడ్లబోరి, మొగఢ్‌దగఢ్ గ్రామాలకు చెందిన దాదాపు 200 మంది రైతులు ధర్నా దిగారు. ఆపై మార్కెట్ ఏరియాలోని ప్రధాన రహదారిపైకి చేరుకొని మూడు గంటల పాటు రాస్తారోకో చేశారు. వ్యవసాయానికి 24 గంటల పాటు విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ సర్కారు, విద్యుత్‌శాఖకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రతి రోజూ కరెంట్ కోతలు విధించడం వల్ల మిర్చి తోటలు ఎండిపోతున్నాయని, లో ఓల్టేజీ సమస్యతో మోటర్లు కాలిపోతున్నాయంటూ మండిపడ్డారు. గుండాయిపేట 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో బూస్టర్ చెడిపోయి ఏడాది కావస్తున్నా మరమ్మతులు చేయడం లేదని, అప్పులు చేసి పంటలు వేశామని, అధికారుల నిర్లక్ష్యంతో నష్టపోయే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇండ్లకు సరఫరా చేసే కరెంటు సమస్య కూడా తీవ్రంగా ఉందని, దోమల బెడద ఎక్కువై అనేక మంది జ్వరాల బారిన పడుతున్నారన్నారు. ధర్నాతో సిర్పూర్-బెజ్జూర్ వైపు దాదాపు కిలోమీటర్ మేర వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు అక్కడికి చేరుకొని రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వారు వినిపించుకోలేదు. విద్యుత్ అధికారుల నుంచి లిఖిత పూర్వకంగా హామీ పత్రం రాసిస్తేనే ధర్నా విరమిస్తామని స్పష్టం చేశారు. చివరకు ఏఈ రవీందర్ అందుబాటులో లేకపోవడంతో మంగళవారం సమస్య పరిష్కరిస్తామని ఆయన వాట్సప్ ద్వారా మెస్సేజ్ పంపడంతో రైతులు ధర్నా విరమించారు. మండల కేంద్రంలోని మార్కెట్‌కు వచ్చిన విర్దండి, తుమ్మిహట్టి, పార్డీ, బాలేపల్లి తదితర గ్రామాల రైతులతో పాటు మాజీ ప్రజాప్రతినిధులు ధర్నాకు మద్దతు పలికారు.

# సత్వరమే స్పందించాలి

కాగజ్‌నగర్, అక్టోబర్ 14 : ప్రజా సమస్యలపై సత్వరమే స్పందించాలని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా అన్నారు. సోమవారం కాగజ్‌నగర్ పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో అధికారులతో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. 22 దరఖాస్తులు వచ్చినట్లు ఆమె తెలిపారు. పట్టణానికి చెందిన లారీ ఓనర్లు, డ్రైవర్లు తమ సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లాకు వినతి పత్రం అందిస్తున్న లారీ అసోసియేషన్ ప్రతినిధులు


# ఐదేళ్ల బాలికపై లైంగికదాడి

జైపూర్, అక్టోబర్ 14 : ఆడుకునేందుకు వెళ్లిన ఐదేళ్ల బాలికపై ఓ కామాంధుడు లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన జైపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కుందారంలో సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కుందారంకు చెందిన సంకె మల్లేశ్ అలియాస్ మల్లయ్య అనేక కూలీ తన ఇంటి సమీపంలో ఉండే బాలికపై కన్నేశాడు. ఆదివారం బయటకు ఆడుకునేందుకు వెళ్లిన చిన్నారిని ఎత్తుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీంతో ఆ బాలిక కేకలు వేస్తూ ఇంటికి రాగా, తల్లిదండ్రులు అసలు విషయం తెలుసుకున్నారు. జైపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలికను మంచిర్యాలలోని హాస్పిటల్‌కు తరలించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని పోక్సో కేసు నమోదు చేసినట్లుగా ఎస్ఐ శ్రీధర్ తెలిపారు.

## క్లిక్..క్లిక్..



కుకుడలో ఆయిల్ ఇంజిన్‌తో పొలానికి వెళ్తున్న రైతు కుటుంబం



ఎడ్లబండిపై పైపులు తీసుకెళ్తున్న రైతు



కరెంట్ మోటర్‌ను ఎడ్లబండిపై తీసుకెళ్తున్న రైతు



పైపులు మోసుకెళ్తున్న రైతు



కుకుడలో పైపు, డీజిల్ క్యాన్‌తో పొలానికి బయలుదేరిన రైతు



కుకుడలో మిర్చి పంటకు నీరందించేందుకు ట్రాక్టర్‌పై పైపులు తీసుకెళ్తున్న రైతు



బెజ్జూర్ శివారులో వరికి నీరందించేందుకు ఆయిల్ ఇంజిన్ ఏర్పాటు చేస్తున్న రైతు

# పంటలు కాపాడుకునేందుకు పాట్లు

*పంటలు చేతికొస్తున్న తరుణంలో వరుణ దేవుడు మొహం చాటేయగా, వాటిని కాపాడుకునేందుకు రైతన్నలు పడరాని పాట్లు పడుతున్నారు. ఐదు నెలల క్రితం వేసిన పత్తి, వరి తదితర పంటలు ఏపుగా పెరగగా, మంచి దిగుబడి వస్తుందని ఆశపడ్డ కర్షకులకు చివరకు నిరాశే ఎదురవుతున్నది. బెజ్జూరు మండలం కుకుడలో పూర్తిగా వర్షాలపై ఆధారపడి పంటలు సాగు చేస్తుంటారు. కొన్ని రోజులుగా వానలు లేకపోవడంతో పొట్ట దశలో ఉన్న పంటలకు నీరందించేందుకు అన్నదాతలు ఆరాటపడుతున్నారు. ఆయిల్ ఇంజిన్లు, కరెంట్ మోటర్లకు మరమ్మతులు చేసి.. చెరువులు, కుంటలు, వాగుల నుంచి పైపుల ద్వారా నీళ్లందించేందుకు కష్టపడుతున్నారు. ఇక ఎలాంటి నీటి వనరులు లేని వారంతా వరుణ దేవుడి కరుణ కోసం ఎదురుచూస్తున్నారు.* - బెజ్జూర్, అక్టోబర్ 14